

నిర్మల్ కొయ్యబొమ్మల పరిశ్రమ కష్టకాలంలో సాగుతోంది. సంప్రదాయ పద్ధతిలో తయారుచేస్తున్న కొయ్యబొమ్మలకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా ముడి సరుకుల ధరలు పెరిగిపోవడం, అలాగే పొనికి కర్రకు కొరతతోపాటు ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన విధానం సక్రమంగా లేకపోవడం, ప్రభుత్వాలు ఈ పరిశ్రమను ఆశించిన రీతిలో ప్రోత్సహించకపోతుండడంతో దీని మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ముడిసరుకు ధరల పెరుగుదల బొమ్మల తయారీపై ప్రభావం చూపుతోందని, తద్వారా కళాకారుల ఉపాధికి గండి పడుతోందంటున్నారు.





కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకున్న కొయ్య బొమ్మలు

కాష్టాల్లో కొయ్యబొమ్మ పరిశ్రమ

- అమలుకాని అమాత్యుల హామీ
- ప్రశ్నార్థకంగా కళాకారుల ఉపాధి
- మార్కెటింగ్ ధరల్లేక ఇక్కట్లు
- ప్రత్యేక పాలసీ కోసం కళాకారుల ఎదురుచూపులు

నిర్మల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ కొయ్యబొమ్మలకు అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు ఉంది. ఇక్కడ తయారయ్యే కొయ్యబొమ్మ లను దేశ,విదేశాల్లో కూడా విక్రయిస్తుంటారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ కొయ్యబొమ్మలకు ఆశించిన డిమాండ్ ఉన్నా సంప్రదాయ రీతిలో ఉన్న మోడల్స్‌కు క్రమంగా ఆదరణ తగ్గుతోంది. అలాగే కొయ్యబొమ్మల తయారీ కోసం ఉపయోగించే ముడిసరుకు ధరలు, ఇతరఖర్చులు భారీగా పెరగడంతో ప్రస్తుతం కొయ్యబొమ్మల ధరలు కూడా పెరిగాయి. ముడిసరుకు కొరత, ధరల పెరుగుదలతో బొమ్మలకు గిరాకీ క్రమంగా తగ్గుతోందని కళాకారులు వాపోతున్నారు. ఈ పరిశ్రమను బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణను చేపట్టకపోతుండడం కూ డా ఈ పరిశ్రమకు శాపంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే గతంలో ప్రధాని మోదీ ఈ కొయ్యబొమ్మల పరిశ్రను ఆదుకుంటామని హామీనిచ్చా రు. ఇదే సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కళాకారుల పొట్టకొట్టిందంటూ ఆరోపించారు. కేంద్రంలో ఏర్పడే బీజేపీ ప్రభుత్వం కొయ్యబొమ్మల పరిశ్రమను అన్నివిధాలుగా ఆదుకుంటుందని, పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తామంటూ మోదీ హామీ ఇచ్చారు. దీంతోపాటు ప్రధాని కొయ్యబొమ్మల పరిశ్రమను ఆదుకోవడమే కాకుండా ప్రత్యేక పాలసీని అమలు చేస్తామంటూ కూడా హామీనిచ్చారు. ప్రధాని ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేరకపోవడంతో కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని ఇచ్చిన హామీని అమలుచేయాలని వారు కోరుతున్నారు.

కేంద్ర జౌళిశాఖ ఆధ్వర్యంలో..

కొద్దిరోజుల క్రితం కేంద్ర జౌళిశాఖ ఆధ్వర్యంలోని ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీ క్రాఫ్ట్ సంస్థ మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా కొయ్యబొమ్మలకు కొత్తఅందాలు తెచ్చేందుకు నిర్ణయం తీసుకొంది. ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ ఆధ్వర్యంలో గురు శిష్యహస్త శిల్పప్రశిక్షణ కింద కొయ్యబొమ్మల కేంద్రాన్ని ప్రత్యేకంగా ఎంపికచేశారు. తెలంగాణ నుంచి కేవలం కొయ్యబొమ్మల కేంద్రాన్ని ఎంపిక చేయడం ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఆంధ్రప్రదేశ్ తిరుపతిలోని లక్ష్మీగారిపల్లె, విశాఖ జిల్లాలోని ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను ఈ పథకం కింద ఎంపిక చేశారు. తెలంగాణలో కేవలం నిర్మల్ కొయ్యబొమ్మలకు ప్రాధాన్యత ఇచ్చి కొయ్యబొమ్మల రూపురేఖలను మరింత ఆధునీకరించేందుకు సిద్ధమవుతున్నారు. గురుశిష్య హస్త శిల్ప ప్రశిక్షణలో భాగంగా 25నుంచి 30ఏళ్ల లోపు ఉన్న కళాకారులకు ప్రాధాన్యతనిచ్చారు. వీరికి 3నెలలు శిక్షణ ఇచ్చారు. అనంతరం వీరికి ఆర్టిజన్ ఐడీ కార్డులను కూడా కేంద్ర జౌళి శాఖ అందించింది. ఈ కార్డుల ద్వారా దేశ, విదేశాలలో నిర్వహించే ట్రేడ్ ఫేర్‌లలో కొయ్యబొమ్మల ప్రదర్శనకు అవకాశాలు ఏర్పడ్డాయి. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లలో కొయ్యబొమ్మల విక్రయాలకు చర్యలు తీసుకోవాలని భావించారు.

తోడ్పాటు నివ్వని శిక్షణలు

నిర్మల్‌లోని కొయ్యబొమ్మల కేంద్రం వర్క్‌షాప్‌లో గురు శిష్య హస్త ప్రశిక్షణ కార్యక్రమాన్ని ఇప్పటికే నిర్వహించారు. యువ కళాకారులకు ఆధునిక మోడల్స్ కొయ్యబొమ్మల తయారీకి సంబంధించి అవగాహన కల్పించారు. బహిరంగ మార్కెట్‌లో రోజురోజుకు పెరుగుతున్న పోటీ, అలాగే ప్రజల ఆసక్తి, డిమాండ్‌ను కూడా పరిగణలోకి తీసుకొని బొమ్మలను తయారు చేసేలా ఇక్కడ శిక్షణ ఇచ్చినా ఆ శిక్షణ ద్వారా కళాకారులకు పెద్దగా ప్రయోజనం చేకూరాలని అంటున్నారు. కేవలం ఓ తంతులాగా మాత్రమే ఈ శిక్షణ కొనసాగిందని కళాకారులు అభిప్రాయపడుతున్నారు.

పొనికి కలప కొరత

గత పదేళ్ల నుంచి నిర్మల్ కొయ్యబొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి కలప కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుతం అడవులలో పొనికి చెట్ల సంఖ్య తగ్గిపోతుండడం, ప్రత్యేక ప్లాంటేషన్ చేపట్టకపోతున్న కారణంగా కలపన కొరత ఏర్పడుతోంది. కేవలం ఒకటి రెండు టింబర్ డిపోల్లో మాత్రమే పొనికి కలపన నిలువలున్నాయి. కొద్ది రోజుల క్రితం ఉపాధి హామీ కింద నిర్మల్‌లోని పలుచోట్ల పొనికి ప్లాంటేషన్ చేపట్టినా వాటి పెంపకం ఇప్పట్లో పూర్తికాదంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొనికి ప్లాంటేషన్‌ను మరింత విస్తృతంగా చేపడితే ఈ కలపకు కొరత తీరుతుందని చెబుతున్నారు.

ప్రధాన మంత్రికి రుణపడి ఉంటాం..

• నాంపల్లి రాజశేఖర్, బొమ్మల కళాకారుడు, నిర్మల్

సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న నిర్మల్ కొయ్యబొమ్మల పరిశ్రమను ఆదుకుంటామంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ కళాకారుల జీవితాలలో ఆశలు నింపింది. ఆయనకు జీవితాంతం కళాకారుల కుటుంబాలన్నీ రుణ పడి ఉంటాయి. ఇచ్చిన హామీ మేరకు వెంటనే పరిశ్రమ రక్షణకు చర్యలు మొదలుకావాలి.

ప్రధాని హామీపై ఆశలు

• పెంటయ్య, కొయ్య బొమ్మల కళాకారుడు, నిర్మల్

కొయ్యబొమ్మల పరిశ్రమను ఆదుకుంటామని ప్రధాని మోదీ హామీపై ఆశలు పెట్టుకున్నాం. హామీని వెంటనే అమలు చేయాలి. పరిశ్రను ప్రోత్సహించేందుకు కొత్త పాలసీ రూపొందిస్తామన్నారు. ప్రధాని హామీ కళాకారుల జీవితాల్లో కొత్త ఆశలు నింపింది. ఇప్పటికే ఉపాధి లేక, బొమ్మలకు సరైన మార్కెట్ లేక నష్టాల పాలవుతున్నాం. పరిశ్రమను ముందుకు నడపడం చాలా కష్టమవుతోంది.



విద్యుత్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎరుకుల నారాయణ

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యుత్ అధికారులపై చర్యలు

» సీజీఆర్ఎఫ్ -2 నిజామాబాద్ చైర్మన్ నారాయణ

భైంసా, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరిస్తే చర్యలు తప్పవని సీజీఆర్ఎఫ్ (కన్జ్యూమర్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ ఫోరం) - 2 నిజామాబాద్ చైర్మన్ ఎరుకుల నారాయణ హెచ్చరించారు. శుక్రవారం భైంసా మండలంలోని దేగాం గ్రామ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమీక్షా నిర్వహించారు. విద్యుత్‌శాఖలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది తమ విధులను సక్రమంగా చేపట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడే సమస్యలపై సకాలంలో స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. సరఫరా వ్యవస్థలో వినియోగదారులకు ఎలాంటి నష్టం వాటిల్లినా సంబంధిత విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అంతేకాకుండా పెనాల్టీ సైతం విధిస్తామని వెల్లడించారు. పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇందులో భైంసా డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఈ ఆదిత్యతో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముథోల్: ముథోల్‌లోని కొలిగల్లీ, ధనగర్ గల్లీ కూడళ్లలో కొన్ని ఏళ్లుగా పేరుకుపోయిన విద్యుత్ తీగల సమస్యలతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోందని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక వినియోగదారులు ఫిర్యాదు చేశారు. పండుగ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. గ్రామంలో ఏ చిన్న విద్యుత్ సమస్య ఉన్నా మిగతా ఏరియాలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోందని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. గత కొన్నేళ్లుగా ఉన్న ఇనుప స్తంభాలను తొలగించాలన్నారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ లైన్‌లు ఇళ్ల పైనుంచి ఉన్నాయని, దీంతో ప్రమాదాలు జరిగేలా ఉన్నాయని నారాయణ దృష్టికి తీసుకువచ్చారు. పలు కాలనీలలో అవసరం ఉన్నచోట కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ ఉప సర్పంచ్ మోహన్ యాదవ్, నాయకులు ఆర్. జీవన్‌లు ఉన్నారు.



నారాయణకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

సారంగాపూర్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ సైజన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. మండలంలో ప్రతీ గ్రామ పంచాయతీలో నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లని నిర్మించుకునేలా అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంతారావులతోపాటు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

దిలావర్‌పూర్‌లో ఎల్లమ్మతల్లి ఆలయ శిఖర ప్రతిష్ఠాపనోత్సవాలు

దిలావర్‌పూర్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర శివారులో పునర్నిర్మించిన ఎల్లమ్మ తల్లి ఆలయ గోపురంపై శిఖర ప్రతిష్ఠాపనకు గ్రామస్థులు, దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం పూజా కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. ఆదివారం ఎల్లమ్మ తల్లి ఆలయ శిఖర ప్రతిష్ఠాపనతోపాటు పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన, కాలభైరవ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఎల్లమ్మ దేవాలయం వద్ద మద్యం, మాంసం నిషేధించినట్లు చెప్పారు. భక్తులు దర్శనం చేసుకోవచ్చని తెలిపారు.

ముథోల్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

ముథోల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ముథోల్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే వివిధ ఆయుధాలు, అత్యవసర సమయంలో ఉపయోగించే వాటి గురించి సీఐ వివరించారు. బాంబులను కనుక్కోవడం, దొంగల వేలి ముద్రలను గుర్తించడం, మాదక ద్రవ్యాలు, పేలుడు పదార్థాలను కనుగొనే జాగిలాల పనితీరును, షీ టీం భరోసా, ట్రాఫిక్, సైబర్ నేరాల నియంత్రణ విభాగాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు బిట్ల పెర్సిస్, రమేష్, రాజశేఖర్, గంగాధర్, పోలీస్ సిబ్బంది, కేజీబీవీ విద్యార్థులు, తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు





బాసర వద్ద గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

గోదారి తీరంలో కార్తీక సందడి

- తొలి శుక్రవారం భారీగా తరలివచ్చిన భక్తులు
- గోదావరి తీరంలో పుణ్య స్నానాలు

బాసర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం కావడంతో బాసరకు భక్తుల తాకిడి మొదలైంది. తొలి శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకంటే ముందు గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. నది తీరంలో గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దినమంతా నది తీరం భక్తులతో సందడిగా కనిపించింది. తెలుగు రాష్ట్రాల నుంచి కాకుండా మహారాష్ట్ర నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్తీక పర్వదినాలను పురస్కరించుకొని అమ్మవారి సన్నిధిలో భక్తులు తమ పిల్లలకు అక్షర శ్రీకార పూజలు జరిపించారు.



నది తీరంలో భక్తుల రద్దీ



చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

లోకేశ్వరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని, అప్పుడే మానసిక ప్రశాంతత కలుగుతుందని సరస్వతి ఆనంద్ మహరాజ్ ఉజ్జయిన్ మహరాజ్ అన్నారు. లోకేశ్వరం మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన బ్రహ్మేశ్వర మహాకాళ్ ఆశ్రమంలో శ్రీశ్రీ సరస్వతి ఆనంద్ మహరాజ్, ఉజ్జయిన్ మహరాజ్ భక్తులకు 50 చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి తర్వాత రోజున జరుపుకునే ఒక అద్భుతమైన కార్యక్రమమని, సోదరులకు, సోదరీమణులు భోజనం పెట్టడం, నూతన వస్త్రాలు అందజేయడం ప్రత్యేకతని అన్నారు. ఆధ్యాత్మికమార్గంలో పయనించడంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. ఆలయాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పునాదిగా నిలుస్తాయని, అవి సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీకలుగా ఉన్నాయన్నారు. అనేకమంది స్వామీజీలు ఆలయాల నిర్వహణలో చురుగ్గా పాల్గొంటున్నారన్నారు. రాబోయే రోజుల్లో బ్రహ్మేశ్వర మహాకాళ్ ఆశ్రయ ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వపాఠశాలలో చదివే విద్యార్థులకు బ్రహ్మేశ్వర మహాకాళ్ ఆశ్రమం తరఫున నోట్‌బుక్స్, వస్తువులు అందిస్తున్నట్లు తెలిపారు.

భీమన్న పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

» అదనపు ఎస్పీ రాజేష్ మీనా

మామడ, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): భీమన్న పండుగను భక్తులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అదనపు ఎస్పీ రాజేష్ మీనా అన్నారు. శుక్రవారం రోజున తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని పోతారం గ్రామానికి చెందిన ఇరువర్గాలను పిలిచి సమావేశం ఏర్పాటు చేశారు. ఏఎస్పీ రాజేష్ మీనా, ఆర్డీవో రత్న కళ్యాణి కలిసి సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఐక్యంగా ఉండాలని, పండుగలు ప్రశాంత శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధి ఎంత ముఖ్యమో అందరూ కలిసి పండుగ జరుపుకోవడం కూడా అంతే అన్నారు. ప్రతిఒక్కరూ చట్ట పరిధిలోని నడుచుకోవాలని, ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, ఎస్సై అశోక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేష్ మీనా, ఆర్డీవో రత్న కళ్యాణి

నేడు తానూర్‌లో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

తానూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 11 గంటలకు చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ మహేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యక్రమానికి హాజరై చెక్కులను పంపిణీ చేయనున్నారని కావు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌రూరల్,అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ప్రియదర్శిని ఫీడర్ నందు లైన్ ఏబీ స్విచ్ ఏర్పాటు చేసేందుకు, ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా భాగ్యనగర్, ఎన్టీఆర్ మార్గ్, రాంనగర్, ఆస్రా కాలనీ, విజయనగర్ కాలనీ, మారుతి ఇన్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని, దీన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంతర్ జిల్లా డిప్యుటేషన్ల దరఖాస్తు గడువు పెంపు

నిర్మల్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా డిప్యూటేషన్ కోసం దరఖాస్తు గడువులు ఎడిట్ ఆప్షన్‌తో సహా ఈ నెల 26 వరకు పొడిగించినట్లు జిల్లావిద్యా శాఖ అధికారి భోజన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు ఈనెల 25వ నుంచి 26 వరకు ఎడిట్ చేసి సమర్పించవచ్చని, అలాగే కొత్త దరఖాస్తు కూడా చేయవచ్చని తెలిపారు.

ఘనంగా గాజుల పండుగ

నిర్మల్‌రూరల్,అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్‌లో మహిళలు గాజుల పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. మొదట మహిళలు మెహందీ కార్యక్రమం నిర్వహించిన అనంతరం పసుపు కుంకుమ, ఆ తర్వాత గాజుల పండుగ జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ పంచుకుంటూ ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు.



గాజుల కార్యక్రమంలో మహిళలు



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

30 ఇందిరమ్మ ఇళ్ల పనుల ప్రారంభం

ఉట్నూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగోజితండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న హనుమాన్ నగర్‌లో 30 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ శుక్రవారం ప్రారంభించారు. 30 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను సైతం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గిరిజన గ్రామాల ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఇల్లు లేని ప్రజలందరికి ఇల్లు కల్పించాలన్న సదుద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ వంశీ, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు పాలనకు నిదర్శనం : బీజేపీ

ఇచ్చోడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గోరక్ష సేవకుడిపై ఎంఐఎం కార్యకర్తలు ఆయుధాలతో దాడి చేయడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యపు పాలనకు నిదర్శనమని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన వ్యక్తం చేస్తూ రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల అక్రమ రవాణాలో మారణాయుధాలు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. అక్రమ రవాణాను అడ్డుకుంటే కత్తులతో దాడులకు దిగుతున్నారన్నారు. గోరక్షకుడిపై దాడిచేసిన నింధితులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. లేనియెడల అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తహరే రమేష్, నాయకులు మాధవరావ్, భీంరెడ్డి, చంద్రశేఖర్, బాబారావ్, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, నేరడిగొండ మండలాల కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠ

బజార్ హత్నూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతంగా నిర్మించిన మహాలక్ష్మి మందిరంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. కాగా, శుక్రవారం మహాస్నానం, దేవత ప్రాణ ప్రతిష్ఠ, ధ్వజారోణ, పూజా హోమం నిర్వహిచి గ్రామం సుభిక్షంగా, సుఖశాంతులతో విలసిల్లాలని అందరూ మొక్కులు తీర్చుకున్నారు. సామూహిక అన్నదానం చేపట్టారు. కాగా రెండు రోజులుగా జరిగిన ఈ మహోత్సవంలో శుక్రవారం దుకాణ సముదాయాలను స్వచ్ఛందంగా మూసి తమకు తోచిన బాధ్యతలను నెరవేర్చారు. విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఒక రోజంతా వందల సంఖ్యలో గ్రామస్థులందరూ ఒక్క తాటికి చేరి అందరూ కలవడంతో గ్రామమంతా సందడి నెలకొంది.



ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న భక్తులు

పశువులకు టీకాలు వేయించాలి

● బోథ్ మండల పశు వైద్యాధికారి సుశీల్ ● ఆదిలాబాద్ జిల్లాలో కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పిప్పల్‌ధరిలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు



గుట్టపక్కతండాలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

బోథ్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు తమ పశువులకు ముందస్తుగా గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలని పశువైద్యాధికారి సుశీల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీకాలు వేయించకపోతే భవిష్యత్తులో గాలికుంటు వ్యాధి సోకే ఆస్కారం ఉందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్: సోనాల మండలంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం కొనసాగుతున్నది. వైద్య సిబ్బంది ఉదయం గ్రామాలకు వెళ్లి పశువులకు టీకాలు వేస్తున్నారు. శుక్రవారం ఉదయం గుట్టపక్క తండా గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్య సిబ్బంది మాట్లాడుతూ రైతులందరూ ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలన్నారు. దీంతో భవిష్యత్తులో పశువులకు గాలికుంటు వ్యాధి సోకదని వివరించారు. రైతులందరూ తమ పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మహేందర్, బాలాజి, పరమేశ్వర్‌లు పాల్గొన్నారు.



శివగాలో పశువులకు టీకా వేస్తున్న డాక్టర్ సురేష్

నేరడిగొండ: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి జీవన్ రాథోడ్ అన్నారు. మండలంలోని నాగమల్యాల్ గ్రామంలో శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలో గల పశువులకు టీకాలు వేసి పశువులకు సోకే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని శివగా గ్రామంలో శుక్రవారం పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాపాలగూడ పశు వైద్యులు డాక్టర్ సురేష్ మాట్లాడుతూ రైతులు, పశు పోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను విధిగా వేయించాలన్నారు. ఈ వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గిపోవడమే కాకుండా వ్యాధి తీవ్రం అయితే పశువులు మృతి చెందే అవకాశం ఉందన్నారు. వ్యాధి మొదటి దశలోనే గుర్తించి టీకాలు వేయించడం ద్వారా పశువులను కాపాడవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.



నాగమల్యాల్‌లో టీకాలు వేస్తున్న డాక్టర్ జీవన్

వేసవిలో కంది పంట సాగు లాభదాయకం

● సోనాల మండల వ్యవసాయ అధికారి దేవానాయక్

బోథ్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రబీ పంట కింద రైతులు కంది పంట సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని సోనాల మండల వ్యవసాయ అధికారి దేవానాయక్ సూచించారు. ప్రాంతంలో రబీ కింద మొక్కజోన్న, జోన్న, శనగ, ధనియాల పంటను సాగు చేస్తుంటారన్నారు.అయితే రైతులు ఈ సీజన్‌లో కంది పంటను సాగు చేసినట్లయితే లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ అధికారి దేవనాయక్ సూచించారు. వేసవి ఎండలు 44 డిగ్రీల వరకు ఉన్న పంట తట్టుకొని ఎదుగుతుందన్నారు. అంతేకాక ఈ పంట జనవరి 15 నుంచి 25 వరకు నాటాలని సూచించారు. పంట కాలం పరిమితి ఒక వంద 20 రోజులు ఉంటుందని కీలక దశల్లో అంటే పూత ఖాతా దశలో ఆరుసార్లు నీటితడులు ఇవ్వాలన్నారు. ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. రైతులు వేసవిలో కంది సాగు చేసి లాభాలు గడించాలని సూచించారు. కంది పంటకు మార్కెట్లో డిమాండ్ ఉండడం వల్ల రైతుకు మంచి లాభం వస్తుందని పేర్కొన్నారు.



సాగవుతున్న కంది పంట

ఖద్దర్ గుప్పిట్లో.. రౌడీలు

(5వ పేజీ తరువాయి...)

కొనసాగుతున్నారు. అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన వారే అడ్డగోలు సంపాదనకు ఎగబడి ఎంతకైనా బరి తెగిస్తున్నారు.

తప్పు చేయాలంటేనే భయం

అమాయకులను టార్గెట్ చేస్తూ బెదిరించడం, ఫేక్ సర్టిఫికేట్లను సృష్టించి కోట్ల విలువైన భూములను కబ్జా చేయడం, భడా సేట్లతో చేతులు కలిపి అడ్డగోలు సంపాదనకు ఎగబడడం కొంత మంది రౌడీషీటర్లకు అలవాటుగానే మారింది. ఇటీవల నమోదైన పలు కేసులను పరిశీలిస్తే విస్తు పోయే విషయాలు బయట పడుతున్నాయి. రౌడీషీటర్లపై పోలీసులు కఠినంగా వ్యవహరించడంతో ఇప్పుడిప్పుడే అక్రమ దందాలకు అడ్డుకట్ట పడుతుంది. తప్పు చేయాలంటేనే రౌడీషీటర్లు భయపడే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇన్నాళ్లు రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయినా.. పోలీసుల ఝులక్‌తో అక్రమ దందాలన్నీ అదుపులోకి వస్తున్నాయి. జిల్లాలో హల్‌చల్ చేసిన రౌడీషీటర్లు సైలెంట్‌గా మారిపోతున్నారు. ఇన్నాళ్లు రౌడీషీటర్లుగా చలామణి అయిన వారంతా ఎన్నో అక్రమాలు, అడ్డగోలు దందాలకు పాల్పడినట్లు తెలుస్తుంది. కొంత మంది రాజకీయ నేతలు రౌడీషీటర్లను అడ్డుపెట్టుకొని భూదందాలకు తెరలేపినట్లు స్పష్టమవుతుంది.



డైట్ కళాశాలలో చాత్రోపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైమ్ ఏఎస్సై బి.సురేందర్

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

● సైబర్ ఏఎస్సై బి.సురేందర్

మావల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సైబర్ క్రైమ్ ఏఎస్ఐ బి. సురేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని డైట్ కళాశాలలో సైబర్ నేరాలపై చాత్రోపాధ్యాయులకి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు బాగా పెరిగాయని, ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాట్సాప్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని అన్నారు. సైబర్ నేరాల్లో విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులు, రైతులు అధికంగా మోసపోతుండడం బాధాకరమన్నారు. అదేవిధంగా ఏ పోలీస్ అధికారి గాని బ్యాంకు అధికారి గాని నేరుగా వాట్సప్ వీడియో కాల్స్ చేయరని, డిజిటల్ అరెస్టులు అని ఎవరైనా కాల్స్ వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల బలహీనతలే సైబర్ నేరగాళ్లకు బలంగా మారిందన్నారు. మారుతున్న టెక్నాలజీతో మోసగాళ్లు చెలరేగిపోతున్నారన్నారు. అప్రమత్తంగా ఉంటేనే నష్టం జరగదన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో నష్టపోతే తక్షణమే 1930లో ఫిర్యాదు చేయాలన్నారు. ఇందులో డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. కేలా కిరణ్, అధ్యాపకులు విజయలక్ష్మి, గంగామణి, ప్రియాంక, సాగరిక, శివకుమార్, కమల్ కిషోర్, ప్రమోద్ రెడ్డి,సైబర్ క్రైమ్ సిబ్బంది సంతోష్, చాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్‌లో వర్షం

బజార్ హత్నూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు దేగామ, గోకొండ, మోర్ఖండి, చందూ నాయక్ తాండా తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఒక్కసారిగా మేఘావృతమై వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. చేలల్లో, ఇళ్లల్లో, వీధుల్లో సోయా, మొక్కజొన్న కుప్పలు ఉండటంతో రైతులు కొంత ఆందోళనలో ఉన్నారు. కప్పి ఉంచిన మొక్కజొన్నకు ఎక్కడ మొళకలు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో వనజ

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

» ఎంపీడీవో వనజ

కుంటాల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం నుంచి చేపట్టనున్న ఇందిరా ఆవాస్ ప్లేస్ యాప్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఎంపీడీవో వనజ సూచించారు. మండల కేంద్రం కుంటాల స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. యాప్‌లో ఎటువంటి తప్పులు లేకుండా సర్వే చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, ఏపీఎం లక్ష్మణ్, వ్యవసాయ శాఖ అధికారులు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

'రామ జన్మభూమిని దర్శిద్దాం రండి'

నిర్మల్‌రూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నిర్మల్ డిపో నుంచి ఈనెల 27న అయోధ్య టు కాశీ యాత్రకు విశేష ఆదరణ రావడంతో నవంబరు 6న మరో బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కే. పండరి తెలిపారు. ఈ బస్సు 6న మధ్యాహ్నం 1 గంటకు నిర్మల్ నుంచి బయల్దేరి తెల్లవారు 9 గంటలకు ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమానికి చేరుకుంటుందని, పవిత్రస్నానం ఆచరించి మధ్యాహ్నం 2గంటలకు కాశీ చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడ కాశీ విశ్వనాథ్, విశాలాక్షి, అన్నపూర్ణ మాత, గంగాహారతి తీసుకొని ఆ రోజు రాత్రి కాశీలోనే ఉండి తెల్లవారు అయోధ్యకు చేరుకొని బాలరాముడిని దర్శనం అనంతరం 9వ తేదీ రాత్రి నిర్మల్ చేరుకొంటుందని తెలిపారు. టికెట్ ధర ఒకరికి రూ.6,400 ఉంటుందని, నిర్మల్ బస్టాండ్‌లోగానీ, సంబంధిత సైట్‌లో లాగిన్‌అయి టికెట్ బుక్ చేసుకోవచ్చని మేనేజర్ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయిలో గోవిజ్ఞాన పరీక్షకు చుచుంద్ పాఠశాల విద్యార్థుల ఎంపిక

భైంసారూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుచుంద్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. గోసేవా విభాగంలో ఈనెల 26న హైదరాబాద్‌లో నిర్వహించే గోవిజ్ఞాన రాష్ట్రస్థాయి పరీక్షలకు చుచుంద్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లక్ష్మీ, వైష్ణవి, అంకిత, శృతిక, లాస్య, భూమేష్ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గంగాధర్, స్టేట్ ప్రెసిడెంట్ గోపాల్, గంగామోహన్, పి.కృష్ణ అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు వీరే..



భైంసాలో నీటి ప్రవాహానికి కొట్టుకపోతున్న సోయా గింజలు



దిగుబడులు తడవకుండా కప్పిన టార్ఫాలిన్ కవర్లు

తడుస్తున్న దిగుబడులు

» వెంటాడుతున్న నష్టం భయం

» ఆందోళనలో రైతన్నలు

నిర్మల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం రాత్రి, శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం కురిసింది. రోజూ వర్షాలు కురుస్తుండంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే కోతకు వచ్చిన పంటలను కల్లాల్లో ఆరబెడుతున్న రైతులు ఈ వర్షం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో సుమారు 50 శాతం సోయా, వరి ధాన్యం కోతకు రాగా రైతులు వాటిని కల్లాల్లో ఆరబెడుతున్నారు. అయితే ఒక్కసారిగా కురిసిన వర్షంతో అనేక ప్రాంతాల్లో పంటలు తడిసిపోయాయి. రైతులు టార్పాలిన్‌లతో కప్పి రక్షించే ప్రయత్నం చేసినా వానతో అవి ఎగిరిపోవడంతో ధాన్యం తడిసిపోయి పాడయ్యే పరిస్థితి నెలకొంది. పంటలు తడవడంతో ధాన్యం నాణ్యత తగ్గి, మార్కెట్‌లో తక్కువధరకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఇలాగే కురిస్తే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

పంట రక్షణకు అన్నదాతల అగచాట్లు

భైంసా: ఇక్కడి ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షంతో అన్నదాతలు ఆగమాగమయ్యారు. ప్రధానంగా భైంసాలోని వ్యవసాయ మార్కెట్‌కు వ్యవసాయోత్పత్తులను విక్రయానికి తెచ్చిన రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. వర్షం ధాటికి విక్రయానికి తీసుకవచ్చిన వ్యవసాయోత్పత్తులు తడిసి పోకుండా కాపాడుకునేందుకు తంటాలు పడ్డారు. సాయంత్రం వ్యవసాయోత్పత్తుల తూకం వేసే ప్రక్రియ కొనసాగుతున్న వేళ వర్షం కురిసింది. ఈ క్రమంలో మార్కెట్ యార్డులోని అన్ని ప్రాంతాల్లో వ్యవసాయోత్పత్తులు బహిరంగంగానే ఉన్నాయి. వర్షం ఒక్కసారిగా రావడంతో అన్నదాతలకు కమిషన్ ఏజెంటు దుకాణాలలోకి పరుగెత్తి వెళ్లి టార్పలిన్ కవర్లు తెచ్చి దిగుబడులు తడిసిపోకుండా కప్పారు. మరికొంత మంది రైతులు వర్షంలో హమాలీల సహాయంతో సోయా, మొక్కజొన్న దిగుబడులను సంచులలో నింపి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే మార్కెట్ యార్డులో వర్షపు నీటిప్రవాహం ధాటికి దిగువ ప్రాంతాల్లో టార్పలిన్ కవర్లు కప్పి ఉన్నా దిగుబడులు తడిసిపోయాయి. నీటి ప్రవాహంలో కొట్టుకపోతున్న సోయా, మొక్కజొన్నలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు.



భైంసా మార్కెట్ యార్డులో తడిసిన మొక్కజొన్న దిగుబడులను చూపుతున్న రైతు

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన సబ్ కలెక్టర్

భైంసారూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేగాం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ పరిశీలించారు. సాంకేత్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న దృశ్యం

30 నుంచి పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

నిర్మల్ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మార్చి 2026లో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు ఈనెల 30 నుంచి చెల్లించాలని డీఈవో శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చేనెల 13 వరకు రూ.125 చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. గడువు ముగిసాక వచ్చేనెల 15 నుంచి 29 వరకు అపరాధ రుసుము రూ.50తో, డిసెంబరు 2 నుంచి 11 వరకు అపరాధ రుసుము రూ.200లతో ఆఖరి అవకాశంగా డిసెంబరు 15 నుంచి 29 వరకు రూ.500ల అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చిన్నారికి పూర్వ విద్యార్థుల అండ

» వైద్య ఖర్చులకు రూ.50వేల ఆర్థిక సహాయం

నర్సాపూర్ (జి), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పప్పు పాత్రలో పడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న చిన్నారి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. వైద్యఖర్చులకు రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈనెల 23న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'చిన్నారిని ఆదుకోండి' అనే శీర్షికకు స్పందన లభించింది. తమ మిత్రురాలైన దివ్యశ్రీ కూతురు తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న 2003-2004 పదో తరగతి బ్యాచ్‌కు పూర్వ విద్యార్థుల అంతా కలిసి రూ. 50వేల ఆర్థిక సాయం అందించారు. ఆపదలో ఉన్న మిత్రురాలికి అండగా నిలవడంలో తమ గొప్ప మనసును చాటుకున్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏ వారసులు

వీఆర్ఏ వారసులకు న్యాయం చేయాలి

» అదనపు కలెక్టర్‌కు వినతి

నిర్మల్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 81, 85 ప్రకారం 3,797 మంది 61ఏళ్ల పైబడిన వీఆర్ఏల వారసులకు త్వరితగతిన నియామక ఉత్తర్వులు ఇప్పించాలని వీఆర్ఏల సంఘం నాయకులు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వీఆర్ఏ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులిచ్చి దళితబలహీనవర్గాలకు చెందిన వీఆర్ఏల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

గన్నోరా గ్రామ బీసీ జేఏసీ కమిటీ ఎన్నిక

ముథోల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని గన్నోరా గ్రామ బీసీ జేఏసీ కమిటీని శుక్రవారం ఏర్పాటు చేసినట్లు ఆ కమిటీ సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా అప్పాల రాజశేఖర్, ఉపాధ్యక్షుడు గజిగిరి దేవన్న, కోశాధికారిగా బోయి భోజన్న, సెక్రటరీగా డి. రాజేష్, ఉపాధ్యక్షులుగా డి. గణేష్, సహ కార్యదర్శి పిల్లిమారి రాజు, సలహా దారులను ఎన్నుకున్నట్లు వివరించారు.



ఎన్నికైన బీసీ జేఏసీ కమిటీ

ముగిసిన దండారీ ఉత్సవాలు

- భోగితో ప్రారంభం
- కోలాబోడితోముగింపు
- సంప్రదాయబద్ధంగా సాగిన కార్యక్రమాలు



గుస్సాడి వేషధారణ తొలగిస్తున్న సుద్దగూడ గిరిజనులు

ఉట్నూర్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో భోగి పండుగతో ప్రారంభమైన గుస్సాడి దండారీ ఉత్సవాలు కోలాబోడి పూజలతో ముగిశాయి. దీపావళి పండుగ ఆదివాసీ గిరిజనులకు ఎంతో ప్రత్యేకమైన పండుగ, జూన్‌మాసంలో ప్రారంభమయ్యే అకాడి పూజల నుంచి అక్టోబర్‌లో జరిగే దీపావళి దండారీ ఉత్సవాలు ఎంతో ప్రీతికరమైనవి. ఎత్మసూర్ దేవతకు పూజ నిర్వహించి కులదేవతకు మొక్కులు చెల్లించుకుంటారు. ప్రతి ఆదివాసీ ఉత్సవంలో గిరిజనులు ప్రతి ఒక్కరూ ఆటపాటలతోనే ఆనందం పొందుతారు. తమ సంస్కృతి సంప్రదాయాలను పూర్వీకుల నుంచి నేర్చుకుని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో సంస్కృతి సాంప్రదాయాలను తూచా తప్పుగా కొనసాగిస్తున్నారు. అందరు బాగుండాలి అందులో మనం ఉండాలి అనే ఆకాంక్షలతో ఆదివాసీ గిరిజనులు తమ దేవతలను కొలుచుకుంటు ప్రార్థిస్తున్నారు. అకాడి మాసంలో కురిసే వర్షాలకు చెట్లు, చేమలు పచ్చగా మారి అడవులు దట్టంగా విస్తరించినప్పుడు తమ పశువులు అడవులకు వెళ్లినప్పుడు క్రూర మృగాల భారీన పడకుండా ఉండాలని అడవి తల్లికి అకాడమీ పూజలు నిర్వహించి వేడుకుంటారు. దసరా తర్వాత వచ్చే దీపావళి వేడుకలు సందర్భంగా గ్రామ గ్రామాన గుస్సాడి దండారీ వేడుకలు ప్రారంభించి పది నుంచి పక్షం రోజుల పాటు దండారీ సంబరాలు నిర్వహిస్తూ వస్తున్నారు. దీపావళి ముగియడంతో బోగి పండుగ చేసి ప్రారంభించిన గుస్సాడి దండాలు ఉత్సవాలను కోలబోడితో సమాప్తం చేస్తున్నారు. మండలంలోని సుద్దుగూడ, మత్తడిగూడ, దుర్గాపూర్, తేజాపూర్, టక్కుగూడ, సాలెవాడ గ్రామాల దండారీ బృందాలు శుక్రవారం కోలబోడి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల సమీపం లో ఉన్న ఇప్పచెట్ల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● విడుదల కాని నిధులు...

ప్రతియేటా గుస్సాడి దండారీ ఉత్సవాలకు ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు ఈ సారి ఇంకా విడుదల కాకపోవడంతో గిరిజనులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న వెయ్యి గుస్సాడి దండారీ బృందాలకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా గత సంవత్సరం రూ.1.50 కోట్లు కేటాయించడంతో ఒక్కొక్క బృందానికి రూ.15వేలు ఇచ్చారు. ఈ సారి కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని గిరిజనులు ఎదురుచూసినా ఇంకా నిధులు రాకపోవడంతో వస్తాయో రావో అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవిస్తున్న ప్రభుత్వం తప్పకుండా నిధులు ఇస్తుందని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తెలిపారు.

దండారీలో పాల్గొన్న బీజేపీ నాయకుడు

భీంపూర్ : మండలంలోని కరంజీ (టీ) అనుబంధ గ్రామం రాజుల వాడిలో శుక్రవారం దండారీ ముగింపు వేడుకలు కనుల పండవగా నిర్వహించారు. కోలా బోడి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ వేడుకలకు మాజీ ఎంపీటీసీ రెడ్డి, వార్ రమేష్ హాజరయ్యారు. అనంతరం గ్రామస్తులు భీమన్న, పేర్సపేన్ దేవుళ్లకు విశేష పూజలు చేశారు. దం డారీ సామగ్రికి కూడా సాంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు.



సుద్దగూడలో దండారి నృత్యం చేస్తున్న గుస్సాడిలు



నృత్యం చేస్తున్న గుస్సాడిలు

క్రైం సమాచారం

రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి



అంబులెన్స్ వద్ద ఎమ్మెల్యే

ఉట్నూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎందా సమీపంలో ఉట్నూర్ ఆదిలాబాద్ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో ఒకరు మృతి చెందారు. ఉమ్మడి జిల్లాలోని జైనూర్ మండలం గోందిపటార్‌కు చెందిన వ్యవసాయ కూలీ కొండిబా అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రి వెంకటిని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో అడ్మిట్ చేసి బైక్‌పై తిరిగి ఇంటికి ప్రయాణమయ్యాడు. ఉట్నూర్ వైపు నుంచి ఆదిలాబాద్ వైపు ద్విచక్రవాహనంపై ఆదిలాబాద్ భుక్తాపూర్‌కు చెందిన కూరగాయల వ్యాపారి సోఫియాన్‌తో పాటు ఆయన స్నేహితుడు మీసేవా నిర్వాహకుడు షేక్ అబ్రార్ ఇద్దరు ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్‌కు బయలుదేరారు. ఎందా సమీపంలోని ఇరుకు వంతెన వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో వంతెన కింద పడిపోవడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయలకు గురైన ముగ్గురిని 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ప్రథమ చికిత్సలు అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా కొండిబా (40) మార్గమధ్యంలో మృతిచెం దాడు. ఉట్నూర్ ఆసుపత్రికి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ప్రమాదంలో గాయపడిన షేక్ సుఫియాన్, షేక్ అబ్రార్ పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఉట్నూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాయం చేసిన ఎమ్మెల్యే బొజ్జుపటేల్...

క్షతగాత్రులు వంతెన కింద పడిపోయి ఉండడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ సాయం చేశారు. మండలంలోని సాలెవాడలో జరుగుతున్న గుస్సాడి దండారీ వేడుకలకు హాజరై తిరిగి వస్తుండగా ఏందా వంతెన వద్ద ప్రమాదం తెలిసింది. చీకట్లో పొదలను దాటుకుంటు వంతెన కిందికి వెళ్లి టార్చిలైట్ల వెలుతురులో క్షతగాత్రులను పరిశీలించారు. 108 అంబులెన్స్‌ను రప్పించి తీవ్ర గాయాలకు గురైన ముగ్గురిని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించాలని సూచించారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య



మృతిచెందిన రవి (ఫైల్)

ఉట్నూర్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు వెళ్లడానికి చేసిన అప్పుతో పాటు పంటకు పెట్టిన పెట్టుబడి రాదని తెలిసిన రైతు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఉట్నూర్ మండలంలోని చెక్‌పోస్టు కొత్త గూడెంలో జరిగింది. బంధువులు తెలిపిన ప్రకారం... చెక్‌పోస్టు కొత్త గూడెంకు చెందిన అజ్మీర రవి (35) ఉపాధి కోసం రెండేళ్ల క్రితం దుబాయికి అప్పులు చేసి వెళ్లాడు. అక్కడ సరైన పని దొరకకపోవడంతో తిరిగి ఇంటికి చేరుకున్నాడు. తనకు ఉన్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో ఈ ఖరీఫ్ పంట కాలంలో పత్తిపంట పండించాడు. అకాల వర్షాలకు పత్తిపంటలో గడ్డిపెరగడంతో దిగుబడి రాదని రవి ఆందోళన చెందాడు. నిస్సహాయ స్థితిలో సోమవారం పంట చేనులో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలిసిన భార్య సవిత బంధువులతో కలిసి జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలిం చారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతిచెందాడని బంధువులు తెలిపారు. మృతుడికి భార్యసవితతో పాటు చదువుకుంటున్న ఇద్దరు కొడుకులున్నారు. బ్యాంకు అప్పు రూ.3లక్షల వరకు ఉంటుందని భార్య సవిత కన్నీరు మున్నీరు అవుతుంది. ఉట్నూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరబెట్టిన సోయా చోరీ

కుంటాల, అక్టోబరు, 24 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు గ్రామంలో గురువారం రాత్రి సోయా పంట చోరీకి గురైంది. గ్రామానికి చెందిన నారాయణ రెడ్డి అనే రైతు పంటను ఆరబెట్టుకునేందుకు గ్రామ సమీపంలో రోడ్డుపై పోసి టార్పాలిన్ కప్పాడు. ఉదయం చూడగా కుప్పల నుంచి సోయాలను దొంగిలించినట్లు గుర్తించామని వాపోయాడు. దాదాపు 5 క్వింటాళ్ల వరకు చోరీకి గురైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కుంటాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

విద్యుతు షాక్‌తో గేదె మృతి



మృతిచెందిన గేదె దృశ్యం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ శివారులో గల పంట చేనులో మేతకు వెళ్లిన గేదె విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే అదు ముల్లా నారాయణకు చెందిన గేదె ప్రతి రోజు లాగే మేతకు వెళ్లింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో అటుగా వెళ్లిన గేదె తగిలి మృతి చెందినట్లు రైతు వాపోయాడు. ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలియజేయడంతో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. తన గేదె లక్ష రూపాయల విలువ ఉంటుందని, ప్రభుత్వం తనకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న దృశ్యం

తలమడుగు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబసభ్యులను మాజీ జడ్పీటీసీ పరామర్శించారు. తలమడుగు మండలం సాయిలింగి గ్రామంలో సాయిబాబా గుడి పంతులు కిషన్ మరణించడంతో వారి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. జారి గ్రామంలో మడవి పురుషోత్తం మరణించడంతో తొక్కిగూడ గ్రామంలో ఆత్రం అనురాధ మరణించడంతో, చెర్లపల్లె గ్రామంలో అనక విలాస్ మరణించడంతో పల్లి బి గ్రామంలో పెందూరు మోతిరం మరణించడంతో అదే గ్రామంలో అత్రం వెంకన్నకు క్యాన్సర్ వ్యాధి సర్జరీ అయినందున వీరి కుటుంబసభ్యులను మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి పరామర్శించారు. సీనియర్ నాయకులు ప్రకాశరావు. మాజీ ఎంపీపీవో రాము. మాజీ ఎంపీటీసీలు పి.మాధవ్. వెంకన్న యాదవ్, సోమన్న ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలైన అనిల్

భీంపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొ నడంతో యువకుడికి తీవ్రగాయాల య్యాయి. వివరాల్లోకి వెళ్తే స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం భీంపూర్ మండలం పిప్పల్కోటి గ్రామానికి చెందిన శ్రీ రామోజీవార్ అనీల్ శుక్రవారం సాయంత్రం ఆదిలాబాద్ నుంచి మోటార్ సైకిల్‌పై వస్తుండగా తాంసి మండలం గోటుకురి - సవర్గవ్ నడుమ గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యా యి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించామని స్థానికులు తెలిపారు.

పూజారి సేవలు చిరస్మరణీయం

తలమడుగు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలంలోని సాయి లింగి గ్రామంలో గల సాయి బాబా ఆలయ పూజారి కిషన్ సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. పంతులు గుండెపోటుతో హఠన్మరణం చెందడంతో శుక్రవారం సాయిలింగి గ్రామంలో నిర్వహించిన ఆలయ పూజారి కిషన్ అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్తులు, నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ఆలయం నిర్మించిన నాటి నుంచి దాదాపు 25 సంవత్సరాలుగా సాయిబాబా ఆలయంలో ప్రధాన అర్చకుడిగా పూజలు నిర్వహించారన్నారు. అంత్యక్రియల్లో ఎంపీడీవో శంకర్, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, సాయి బాబా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దెబ్బడి అశోక్, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేష్, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కను పెంచుతున్న వ్యక్తి అరెస్టు

- 690 గ్రాముల గంజాయి స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రాజేష్ మీనా

నిర్మల్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో ఒక వ్యక్తి తన ఇంటి వెనుక గంజాయి మొక్కను పెంచుతున్నాడన్న నమ్మదగిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఆదేశాల మేరకు రూరల్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించి నిందితుడిని పట్టుకున్నట్లు అదనపు ఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. అదనపు ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం వైఎస్ఆర్ కాలనీలో నివాసముండే దేశముఖ్ మాధవ్ అనే వ్యక్తి తన ఇంటి వెనుక నిషేధిత గంజాయి మొక్క (690 గ్రాముల పచ్చి గంజాయి మొక్క)ను పెంచుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడికి గంజాయి తాగే అలవాటు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. జిల్లాలో ఉన్న ఆధునిక టెక్నాలజీ, జాగిలాల సహాయంతో తనిఖీలు చేసి, నిందితుడిని పట్టుకోవడంలో చురుకుగా వ్యవహరించిన రూరల్ ఇన్స్‌పెక్టర్ కృష్ణ, ఎస్సై లింబాద్రి, ఆర్‌ఐ శేఖర్, ఏఎస్సై బాబారావు, కానిస్టేబుళ్లు సంతోష్, అజీజ్, తిరుపతిలను ఎస్పీ డా. జి. జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు. యువత గంజాయి వంటి నిషేధిత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఈ సందర్భంగా హెచ్చరించారు. గంజాయి సాగు, అమ్మకాలు, రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే వెంటనే డయల్ 100, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తెలుపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మార్కెట్ యార్డుకు తరలుతున్న పంట



బోథ్ మార్కెట్‌యార్డులో రైతులు ఆరబెట్టిన సోయాబీన్, మొక్కజొన్న పంట

- భారీగా వచ్చిన సోయాబీన్, మొక్కజొన్న
- పంట కాపాడుకునేందుకు రైతులకు తిప్పలు

బోథ్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు కింద రైతులు పండించిన మొక్కజొన్న సోయాబీన్ పంటలు చేతికి వచ్చి దాదాపు 15 రోజులు పూర్తి అవుతున్నాయి. అయితే పండించిన పంటను ప్రభుత్వరంగ సంస్థలకు అమ్ముకునేందుకు రైతులు ముందు చూపుతో బోథ్ మార్కెట్‌యార్డుకు పంటను తీసుకువచ్చారు. కాగా పంట కొనుగోలు ప్రారంభం కాదని, ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించేందుకు రైతుల సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు కొనుగోలు ఎప్పుడు ప్రారంభిస్తారనేది తెలియక రైతులు సతమతమవుతున్నారు.

రైతుల్లో ఆందోళన...


సోయాబీన్, మొక్కజొన్న పంటలు చేతికి వచ్చి 15 రోజులైనా పంట కొనుగోళ్లను ప్రభుత్వం చేపట్టకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది దీంతో రైతులు గత రెండు రోజుల క్రితం పంట కొనుగోలు చేపట్టాలని ఆందోళన దిగారు. అయినా ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాక పోవడంతో పంట కొనుగోలు చేపడతారా లేదా అనే విషయమై రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో పంట కొనుగోళ్ల పై స్పష్టమైన హామీ వస్తుందని రైతులు ఎదురు చూశారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ రాకపోగా స్థానికంగా ఉన్న అధికారులు మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి కొనుగోళ్ల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక అధికార పార్టీ నాయకులు పంట కొనుగోలు జరిగే విధంగా మంత్రులతో మాట్లాడమని పేర్కొంటునే వస్తున్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకులు పంట కొనుగోలు ఎప్పుడు చేపడతారని ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. కొనుగోళ్ల విషయంలో రాజకీయం పక్కన పెట్టి పంట కొనుగోళ్లు చేపట్టే విధంగా చూడాల్సిన అవసరం ఉంది.

ఇప్పటికే జాప్యం..

సోయాబీన్ మొక్కజొన్న పంటల కొనుగోలు గత ఏడాది దసరా పండుగ తర్వాత కొనుగోలు చేపట్టారు. అయితే ఈ సారి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిన అధికారులు కొనుగోలను మాత్రం చేపట్టడం లేదని రైతులు పేర్కొంటున్నారు. పంట మార్కెట్‌కు తీసుకొని వచ్చి ఆరబెడుతున్నామని పది రోజుల నుంచి పంట ఆరబెట్టి వర్షం వచ్చినప్పుడు కుప్పలు చేసి ఉంచడం పనిగా మారిందని రైతులు అంటున్నారు. అధికారులు పంట కొనుగోలు చేపడితే రబీ పంటలు వేసుకొని అస్కారం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

తగ్గని తేమ శాతం

బోథ్ మార్కెట్‌కు తీసుకువచ్చిన మొక్కజొన్న పంట పరిశీలించడం జరిగిందని తేమ శాతం 35 నుంచి 40 వరకు ఉందని సహాకార సంఘం సీఈఓ గోలిస్వామి తెలిపారు. పంట తేమ శాతం13 వరకు ఉంటే తాము కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు అంటున్నారు.



బస్సులు రాక.. విద్యార్థుల ఇబ్బందులు

భీంపూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్లి(టీ) నుంచి కరంజి(టీ) వరకు రోడ్డు గుంతలమయం ఉండటంతో రెండు రోజులుగా బస్సులను ఆర్లీ(టీ) వరకే నడుపుతున్నారు. దీనితో అంతర్గవ్, గోముత్రి, కరణ్వాడి, కరంజి గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కాగా గుబుడి వరకు వెళ్తున్న బస్సు సుంకుడి, మహారాష్ట్ర మండివి మీదుగా వచ్చి వెళ్తోంది. దీంతో ఆ గ్రామాల వారే జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. కరంజి(టి) పాఠశాలలో చదివే విద్యార్థులు సెలవు తరువాత గోముత్రి, అంతర్గవ్‌లకు వెళ్లడానికి ఆటోలను ఆశ్రయిస్తున్నారని, ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశామని నాయకులు తెలిపారు.


ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బందితో మాట్లాడుతున్న డీఐఈవో గణేష్

ఇంటర్ సిలబస్ త్వరగా పూర్తి చేయాలి

ఉట్నూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరిలో జరుగనున్నందున విద్యార్థుల సిలబస్ త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జాదవ్ గణేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. కళాశాలలోని రికార్డులను పరిశీలించిన సిలబస్‌తో పాటు విద్యార్థుల హాజరు శాతం విషయమై అధ్యాపకులతో మాట్లాడారు. సైన్స్ అధ్యాపకులు ప్రాక్టికల్ నిర్వహించడంపై సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, అధ్యాపకులు శ్రీనివాస్, సువర్ణ, గణేష్, తిరుపతి, దత్తు, సుధాకర్, నీలోఫర్, రానా, విష్ణు, అధ్యాపకేతరులు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్ సీఐ బదిలీ

బోథ్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బోథ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు హైదరాబాద్‌లోని సీఐడీ విభాగానికి బదిలీ అయినట్లు తెలిసింది. ఆయన స్థానంలో వరంగల్ ఎస్‌బీలో విధులు నిర్వహిస్తున్న గురుస్వామి బోథ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రానున్నట్లు సమాచారం. కాగా ఈ విషయమై సీఐని వివరణ కోరగా ఇంకా బదిలీ ఆర్డర్ అందలేదని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న బోథ్ ఆత్మ చైర్మన్

'రైతుల పంటలన్నీ కొనుగోలు చేయిస్తాం'

బోథ్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ గింజలు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని బోథ్‌ఆత్మ చైర్మన్ రాజు యాదవ్ పేర్కొన్నారు. బోథ్‌లో మాట్లాడారు. ఇప్పటికే మొక్కజొన్న కొనుగోలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుందామని, సోయాబీన్ పంట కోసం జిల్లా ఇన్‌చార్జీ మంత్రితో మాట్లాడడం జరిగిందన్నారు. అంతేగాక మార్కెట్ ఎంతో మాట్లాడి నాలుగు రోజుల్లో కొనుగోలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు రైతులపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

» లఖంపూర్‌లో జీసీడీవో మెస్రం ఛాయా

నేరడిగొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జీసీడీవో మెస్రం ఛాయా అన్నారు. శుక్రవారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో (సమ్మెటివ్ అసెస్మెంట్) ఎస్ఏ -1 పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులు రాస్తున్న తీరును పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రతి పాఠశాల సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల హాజరు, ఫలితాల మెరుగుదల, బోధన నాణ్యత, శాతం పెంపుపై ఉపాధ్యాయులు ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో సమగ్రమైన ప్రణాళికను రూపొందించాలని, గత ఏడాది ఎస్ఎస్‌సీ ఫలితాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి మరింత శాతం పెంచే దిశగా ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని జీసీడీవో ఛాయా ఈ సందర్భంగా సూచించారు.


పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న జీసీడీవో ఛాయా





ఖద్దరు గుప్పిట్లో.. రౌడీలు

జిల్లాలో ప్రధాన పార్టీలు.. రౌడీషీటర్లకు అడ్డాలుగా మారుతున్నాయి. నేతల కనుసన్నల్లోనే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దిగుతున్నారు. రాజకీయ ముసుగులో తెరవెనుక ఉండి అడ్డగోలు దందాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. కొంత మంది రాజకీయ నేతలే తమ అవసరాల కోసం దాదాలు, గుండాలను పెంచి పోషిస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఎస్పీ అఖిల్ మహాజన్ ఝులక్‌తో రౌడీషీటర్ల అక్రమ భాగోతాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. ఇన్నాళ్లు అంతా సైలెంట్‌గానే కనిపించినా.. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయడంతో రౌడీషీటర్లు మళ్లీ కటకటాల పాలవుతున్నారు. గత కొద్ది రోజులుగా పోలీసులు కొరడా ఝులిపించడంతో జైలుకు క్యూకడుతున్నారు.

» జిల్లాలో దాదాలు, గుండాలను పెంచి పోషిస్తున్న నేతలు

» మొత్తం 180 మంది రౌడీషీటర్లు ఉండగా.. ఒక్కొక్కరిపై 20 నుంచి 30 కేసులు!!

» అరెస్టయిన రౌడీలంతా ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన వారే..

» కాపాడుకునేందుకు రాష్ట్రస్థాయిలో చక్రం తిప్పుతున్న అగ్రనేతలు

» అమాయకులకు బెదిరింపులు.. భూదందా సెటిల్‌మెంట్లతో బరితెగింపు

» ఎస్పీ ఝులక్‌తో జంకుతున్న నేతలు, రౌడీషీటర్లు

ఆదిలాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 180 మంది రౌడీషీటర్లు ఉండగా.. ఇందులో ప్రవర్తన మార్చుకున్న 30 మందిపై కేసులు ఎత్తి వేసేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. సుమారుగా మరో 10 మంది ప్రైవేట్ వ్యక్తులు గన్‌లైసెన్స్‌ను కలిగి ఉన్నారు. ఒక్కో రౌడీషీటర్‌పై 20 నుంచి 30 వరకు కేసులు ఉన్నట్లు తెలుస్తుంది. పట్టణ శివారు ప్రాంతాలు, మహారాష్ట్ర సరిహద్దులే అడ్డాలుగా రౌడీషీటర్లు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. కత్తులు, తల్వార్లతో సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన పలు సంఘటనల్లో రౌడీషీటర్ల పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేయడం జిల్లా లో హాట్‌టాపిక్‌గా మారింది.

రాజకీయ అండ

పలు కేసుల్లో ఇరుక్కొని అరెస్టు అయిన రౌడీలంతా ప్రధాన రాజకీయ పార్టీల్లోనే కొనసాగుతున్నారు. ఇన్నాళ్ల చోటామోటా నేతలుగా చలామణి అయిన రౌడీలు.. ప్రస్తుతం జైలు జీవితాన్ని గడుపుతున్నారు. కేసుల నుంచి బయట పడేందుకే పార్టీ కండువాలను మార్చినా.. ఫలితం లేదంటూ ఆవేదనకు లోనవుతున్నా రు. కొన్ని సందర్భాల్లో పార్టీ అగ్రనేతల పైననే అంతర్గతంగా తిరుగుబాటు చేస్తున్నారు. ప్రధానంగా భూకబ్జాలు, నకిలీ డాక్యుమెంట్ల తయారీ, బెదిరింపులు, దాడులకు పాల్పడడంతో పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. అక్రమ కేసుల్లో ఇరుక్కొని మళ్లీ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడంపై విమర్శలు వస్తున్నాయి. నేరచరిత్ర కలిగిన వారి జన్మదిన వేడుకల్లో పాల్గొంటూ వారికి అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నారు. ఇటీవల ఓ కేసులో జైలుకు వెళ్లి వచ్చిన రౌడీషీటర్‌కు ఓ పార్టీకి చెందిన నేతలు ఏకంగా ఖరీదైన కారునే గిఫ్ట్‌గా ఇవ్వడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. అలాగే కొంత మంది రౌడీషీటర్లు పార్టీ పదవులతో పాటు మాజీ ప్రజాప్రతినిధులుగా కూడా

(తరువాయి 6వ పేజీలో...)

అధికారులపై ఒత్తిళ్లు

అధికారం అండతో కొంత మంది నేతలు అధికారుల పై ఒత్తిళ్లు చేస్తున్నట్లు తెలుస్తుంది. తమ సన్నిహితుల పై రౌడీషీటర్ కేసులు నమోదు చేస్తూ వేధింపులకు గురి చేయడాన్ని తట్టుకోలేక పోతున్నారు. జిల్లా పోలీసుల దూకుడుపై రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు లు చేస్తున్నట్లు తెలుస్తుంది. కొరకరాని కొయ్యగా మారిన పోలీసు అధికారులపై బదిలీ వేటు వేసేందుకు శతకోటి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఎలాగైనా తమ అనుచరులను కాపాడుకోవాలన్న ఉద్దేశంతో కొంత మంది నేతలు రాష్ట్రస్థాయిలో చక్రం తిప్పుతున్నారన్న ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులకు పిర్యాదు చేసినా.. పట్టించుకోక పోవడం తో తలలు బాదుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇలాగైతే ఇక రాజకీయం చేయలేమంటూ కొంత మంది నేతలు బహిరంగంగానే మాట్లాడుకోవడం కనిపిస్తుంది.

గిరిజన విద్యార్థికి చెక్కు అందజేత

ఉట్నూర్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన విద్యార్థికి రూ.25 వేల చెక్కును సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అందించారు. శుక్రవారం ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో ఉన్నత విద్య కోర్సులలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి రాథోడ్ అవినాశ్‌కు ప్రోత్సాహకంగా చెక్కును అందించామన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యలో తమ ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఎమ్‌బీబీఎస్ చదువు కొరకు వారి తల్లిదండ్రుల సమక్షంలో పైచదువుల నిమిత్తం చెక్కును గిరిజన విద్యార్థికి అందించడం జరిగిందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని పట్టుదలతో సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న పీవో ఖుష్బుగుప్తా

జాతీయ స్థాయి విజేతకు సన్మానం

ఉట్నూర్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి)ఒడిస్సా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో ఇటీవల జరిగిన జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో బంగారు పతకం సాధించిన జాతర్ల గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థి జాకీష్‌ను శుక్రవారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అంబాజిజాదవ్ ఘనంగా సత్కరించి అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో ట్రయతలాన్ అంశంలో కొత్త జాతీయ రికార్డు నెలకొల్పడం అభినందనీయం అన్నారు. కిడ్స్ జావలీన్ త్రోలోను కాంస్య పథకం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బంగారు పతకం సాధించిన విద్యార్థి జాకీష్‌కు జిల్లా గిరిజన శాఖ, ఐటీడీఏ తరపున అన్ని రకాల ప్రోత్సాహం అందిస్తామన్నారు. అదేవిధంగా ఇటీవల సంగారెడ్డిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాస్పూర్లో నవంబర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి వాలీబాల్ పోటీలో పాల్గొనేందుకు ఎంపికైన పవన్‌ను సన్మానించారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, సుచైతన్‌రెడ్డి, హెచ్ఎం కిషన్‌రెడ్డి, ఫిజికల్‌డైరెక్టర్ హేమంత్నాయక్, మోహన్‌సింగ్, కోచ్‌లు సాహిల్, హాతిరామ్ తదితరులున్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ అంబాజి జాదవ్

నాణ్యమైన పత్తి తెచ్చి మద్దతు ధర పొందాలి

» కలెక్టర్ రాజర్షి షా » ఆదిలాబాద్ మార్కెట్లో ప్రారంభమైన పత్తి కొనుగోళ్లు » తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా


తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ..

ఆదిలాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి రైతులు మద్దతు ధరను పొందాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో అధికారులతో కలిసి కలెక్టర్ పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సీసీఐ ద్వారా క్వింటాలు పత్తికి రూ.8110 మద్దతు ధరను చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ మార్కెట్లో ప్రస్తుతం క్వింటాలు పత్తికి రూ.6500 ధర పలుకుతుందని తెలిపారు. జిల్లాలో పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా సాగేందుకు అన్నిరకాల ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టామన్నారు. మార్కెట్ యార్డులో తాగునీరు, విశ్రాంతి సదుపాయాలతో పాటు తూకం యంత్రాలు, కంట్రోల్ రూమ్ వంటి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తామని తెలిపారు. ఈసారి 33 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. జిల్లాలో 33 జిన్నింగ్ మిల్స్ అందుబాటులో ఉన్నాయని పత్తి కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఏడీ గజానన్, వ్యవసాయ అధికారి శ్రీధర్‌స్వామి, సీసీఐ మేనేజర్ పుణీత్‌రాఠీ, సెంటర్ ఇన్‌చార్జీ ఏ.శరత్, చంద్రశేఖర్‌రెడ్డి, ఏఓ, మార్కెటింగ్ అధికారులు శ్రీకాంత్, తదితరులున్నారు.

దరఖాస్తుల జారీ వేగవంతం చేయాలి

దరఖాస్తుదారుల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజార్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అనంతరం కలెక్టర్ కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ నుంచి ధ్రువీకరణ పత్రాల జారీ వరకు జరుగుతున్న విధానాన్ని సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ ప్రజలు సమయానుసారంగా సేవలు పొందేలా తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే కుల, ఆదాయ, నివాస, ఇతర ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను ఆలస్యం చేయకుండా త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రతీ దరఖాస్తుపై క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేసి నిజనిర్ధారణ అనంతరం ధ్రువపత్రాలను తక్షణమే జారీ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా భూభారతి దరఖాస్తుల నిర్వహణలో కచ్చితత్వం పాటించాలని, ఇన్‌వర్డ్, ఔట్‌వర్డ్ రిజిస్టర్లను ప్రతీరోజు సక్రమంగా నమోదు చేయాలన్నారు. అలాగే, కార్యాలయంలో సమయపాలన పాటిస్తూ పారదర్శకతతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


డీఎస్పీ జీవన్‌రెడ్డితో తాంసి యువకులు

పరుగుపందెంలో తాంసి యువకుల ప్రతిభ

తాంసి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోలీసుల పరుగు పందెంలో తాంసి యువకులు ప్రతిభ కనబరిచారు. పరుగు పందెంలో తాంసికి చెందిన వడ్రంగి నవీన్, జింక సాయిలు ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. జిల్లా ఎస్పీతో పాటు డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, తాంసి ఎస్సై జీవన్ రెడ్డిలు వారిని అభినందించారు. వందలాది మంది పాల్గొన్న ఈ పరుగు పందెంలో తాంసి వాసులు ప్రతిభ కనబరచడం అభినందనీయమని డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి పేర్కొన్నారు.


జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్


పాల్గొన్న ఎస్పీ, పోలీసులు, యువత

పోలీసు అమరుల త్యాగాలను గుర్తించాలి

» 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించిన ఎస్పీ అఖిల్ మహాజన్ » పాల్గొన్న పోలీసు సిబ్బంది, 1500 మంది యువకులు

ఆదిలాబాద్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాన్ని ప్రతీ ఒక్కరు గుర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి 5కే రన్ కార్యక్రమాన్ని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. కాగా, స్టేడియం నుంచి ప్రారంభమై 5కే రన్ పట్టణంలోని ప్రధాన కూడళ్లయిన కలెక్టర్‌చౌక్, ఎన్టీఆర్‌చౌక్, వినాయక్‌చౌక్, నేతాజిచౌక్, అంబేద్కర్‌చౌక్‌ల గుండా కొనసాగింది. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రశాంత జిల్లాకు కారణం ఒకప్పటి పోలీసు ప్రాణత్యాగాల ఫలితమే అని అన్నారు. వారి జ్ఞాపకార్థం, త్యాగాలను స్మరిస్తూ వారం రోజుల పాటు నిర్వహించే అమరవీరుల వారోత్సవాలలో భాగంగా పలు ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 5కే రన్‌ను ప్రారంభించగా జిల్లావ్యాప్తంగా ఉన్న యువత దాదాపు 1500 మంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు గ్రామ గ్రామాన అభివృద్ధి బాటలో, పయనం కావడానికి నిదర్శనం అని తెలిపారు. సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షించడానికి ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకు పోలీసు యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుందని గుర్తు చేశారు. ప్రతి ఒక్క పోలీసు పండుగలను త్యాగం చేసి ప్రజా రక్షణకై విధులు నిర్వర్తిస్తుంటారని తెలిపారు. త్వరలో జిల్లాలో హాఫ్ మారథాన్ ఏర్పాటు చేయనున్నట్లు దీనికి ప్రతి ఒక్క యువత సంసిద్ధమై హాఫ్ మారథాన్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా ఐదు కిలో మీటర్ల పరుగును పూర్తి చేసి సిబ్బందికి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఇందులో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్, హసిబుల్ల, పట్టణ సీఐలు, ఎస్సైలు, యువత, స్పోర్ట్స్ పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

పంటలను ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలి


ఇచ్చోడలో మార్కెట్ యార్డు ఎదుట రాస్తారోకో చేస్తున్న రైతులు

ఇచ్చోడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మార్కెట్ యార్డుకి రైతులు తీసుకువచ్చిన సోయాబీన్ పంటను వెంటనే కొనుగోలు చేపట్టాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. శుక్రవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ముందరున్న జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఆగస్టు, సెప్టెంబరు మాసాలలో కురిసిన అతి భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన ప్రతీ రైతుకు ఎకరానికి 10 వేల రూపాయలను అందిస్తామని ఇచ్చిన హామీని ఇప్పటివరకు ఏ ఒక్క రైతుకు కూడా అందించలేదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇకనైనా రైతులు పండించిన పంటలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు సంజీవ్, రాజారెడ్డి, మారుతి, గంగాధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.